కల్యాణం.. వైభోగం!


స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

- కిక్కిరిసిన భక్తజనం
- నగర ఆలయాల్లో కల్యాణ శోభ

కడప కల్చరల్ : అడుగడుగో.. నీలమేఘ శ్యాముడు, దశరథరాముడు కల్యాణమూర్తిగా వేదికపై పెళ్లి పీటపై కొలువుదీరాడు. అదిగో..ఆ పక్కనే సౌందర్య రాశి ఆదర్శమూర్తి సీతమ్మ పెళ్లి పీటపై ఒదిగి ఒదిడి కూర్చొని ఉన్నారు. ఆ ఇద్దరి ఆదర్శమూర్తుల కల్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది.కడప నగరంలోని అన్ని రామాలయాల్లో శ్రీరామ నవమి సందర్భంగా గురువారం కల్యాణోత్సవాలు, విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం 10 గంటల నుంచి కల్యాణ కార్యక్రమాలు ప్రారంభించి మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల్లోపుగా ముగించారు. దాదాపు అన్ని ఆలయాల వద్ద భక్తులకు కల్యాణ విందు ఏర్పాటు చేశారు.

హౌసింగ్‌బోర్డులో..

హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవంలో భాగంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రముఖ వేద పండితులతోపాటు చిన్మయ మిషన్ జిల్లా అధ్యక్షుడు స్వామి తురియానంద పర్యవేక్షణలో అర్చకుల బృందం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. కల్యాణానికి వాడిన ముత్యాల తలంబ్రాలను భక్తులందరికీ కల్యాణోత్సవ ప్రసాదంగా పంచి పెట్టారు. ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి బృందం పర్యవేక్షణలో కల్యాణోత్సవంలో గాయకులు భక్తిగీతాలను ఆలపించారు. స్థానిక మహిళా భక్తులు శ్రీరాముని పాటలకు కోలాటం ప్రదర్శించారు. సాయంత్రం స్థానిక వీధుల్లో అట్టహాసంగా గ్రామోత్సవం నిర్వహించారు.


పటేల్ రోడ్డులోని రామాలయంలో ...


సింహపురి కాలనీ రామాలయంలో కల్యాణోత్సవం


బేల్దారి వీధిలో సీతారాముల కల్యాణం

అన్నదానం


సంధ్యా సర్కిల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి


కొండాయపల్లె రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మేయర్ సురేష్ బాబు


చిన్నచౌకులో పానకం, వడపప్పు పంపిణీ చేస్తున్న శ్రీనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కడప కార్పొరేషన్ : శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని స్థానిక సంధ్యా థియేటర్ వద్ద నున్న శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయం వద్ద ధర్మకర్త మహిమలూరి వెంకటేష్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమలాపురం శాసన సభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు.45వ డివిజన్ ఇన్‌చార్జి జి. శ్రీనువాసులరెడ్డి, పాపాసాహెబ్ పేట సర్పంచ్ సురేంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె మండల కన్వీనర్ జి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక శ్రీనగర్ కాలనీ (పుట్లంపల్లిరోడ్)లో నిర్మించిన నూతన రామాలయంలో మేయర్ సురేష్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అరవిందనగర్‌లో 13వ డివిజన్ కార్పొరేటర్ రామలక్ష్మణ్‌రెడ్డి ఆధ్వర్యంలో రామాలయంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య, మహిళా కమిషన్ సభ్యురాలు వెంకట లక్ష్మి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

■ కడప నగర శివార్లలో సెంట్రల్ జైలు ప్రక్కనున్న శ్రీరామ్ నగర్ సీతా కోదండ రామాలయంలో బాతల వెంకటకృష్ణ, వారి కుమారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

■ కడప నగరం చిన్నచౌకులోని శ్రీనగర్ కాలనీలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పానకం, వడపప్పు పంపిణీ చేశారు. ఆ తర్వాత పిడుగురాము గారి కొండారెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సభ్యులు ప్రారంభించారు. శ్రీనగర్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విజయదుర్గ కాలనీలో నవమి వేడుకలు

కడప రూరల్: కడప నగరంలోని విజయదుర్గ కాలనీలో కాలనీ అభివృద్ధి కమిటీ నాయకులు గోవిందు నాగరాజు ఆధ్వర్యంలో గురువారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పులను పంపిణీ చేశారు. విజయదుర్గ కాలనీ వాసులు ఎస్. ఆంజనేయులు, జయరామిరెడ్డి, కొండారెడ్డి, రాధాకృష్ణ, సీఆర్‌ఐ సునీల్ జయంత్, పాలకొండ్రాయుడు, వేణుగోపాల్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి, బోయల తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి


ఐక్యతను చాటుతున్న బంజారా సేవా సంఘం నాయకులు

కడప రూరల్ : వాల్మీకి, బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదించిన తీర్మానాలను వెనక్కి తీసుకోవాలని ఆలిండియా బంజారా సేవా సంఘం కోశాధికారి డాక్టర్ ఐ.శివానాయక్, రాష్ట్ర సలహాదారు అర్జున్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటికే వాల్మీకి, బోయలు అభివృద్ధి చెందారని తెలిపారు. అలాంటి వారిని ఎస్టీ జాబితాలో చేర్చాలని తీర్మానించడం తగదన్నారు. ఈ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆ సంఘం నాయకులు వెంకటస్వామి, జగన్నాయక్, కిరణ్‌కుమార్ నాయక్, శ్రీనివాస నాయక్, రఘు నాయక్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హార్మోనిస్టు మృతి నాటకరంగానికి తీరని లోటు

కడప కల్చరల్ : నగరానికి చెందిన ప్రముఖ హార్మోనిస్టు వాదినాల చంద్ర ఓబుళపతి మృతి నాటక రంగానికి తీరని లోటని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం బ్రౌన్ గ్రంథాలయంలో హార్మోనిస్టు చంద్ర ఓబుళపతి సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి ఆచార్య మల్లికార్జునరెడ్డి శిష్య బృందం పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ సిద్దవటం మూలపల్లికి చెందిన చంద్ర ఓబుళపతి 30 ఏళ్లకు పైగా హార్మోనిస్టుగా 2000కు పైగా నాటకాలకు సంగీత సహకారం అందించారన్నారు.హార్మోనిస్టు వలసిగాండ్ల సుధాకర్, నటుడు వలసిగాండ్ల సుబ్బరాయుడు ఓబుళపతితో తమకుగల అనుబంధాన్ని స్మరించుకున్నారు. పలువురు నటులు, సీపీ బ్రౌన్ కేంద్రం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తులు పంపిణీ

ప్రొద్దుటూరు : ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిసా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేశారు. అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు దివ్యాంగులకు దుస్తులను అందించారు. సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షాకీర్‌హుసేన్, అల్తాఫ్, మహ్మద్‌బాషా, వెంకటసుబ్బయ్య, పవన్, భద్రుడు పాల్గొన్నారు.

5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి

ప్రొద్దుటూరు : వివిధ వర్గాలకు చెందిన కార్మికుల, కర్షకుల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు. తమ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మికులు, రైతులతోపాటు పేద ప్రజల పక్షాన పనిచేయకుండా వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. మున్సిపల్ కార్మికులకు రూ.26వేలు వేతనం ఇవ్వాలని, పర్మినెంట్ చేయాలని, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు సుప్రీం కోర్టు గైడెన్స్ ప్రకారం రూ.26వేలు వేతనం ఇవ్వాలని కోరారు. రైతు ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేశారు.

బాబోయ్ దుమ్ము!


మద్రాసు రోడ్డులో వాహనాలు వెళ్తుంటే ఎర్రటి దుమ్ము రేగుతున్న దృశ్యం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో సంజన్న సర్కిల్ నుంచి తిరుపతి రోడ్‌లో వైఎస్సార్ సర్కిల్ వరకూ కొత్తగా డివైడర్ నిర్మించారు. గురువారం అందులో టిప్పర్లతో మట్టి తీసుకొచ్చి రోడ్డుపై వేసి, ఆ తర్వాత జేసీబీతో డివైడర్ల మధ్య వేశారు. యంత్రాలతో పనులు చేయడం వల్ల రహదారిపై వేసిన మట్టి చాలా వరకూ అలాగే ఉండిపోయింది. అసలే జాతీయ రహదారి నిత్యం బస్సులు, వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో వాహనాలు పోయినప్పుడల్లా ఎర్రటి మట్టి గాల్లోకి లేచింది. సుమారు ఒకటిన్నర కిలో మీటరు మేర ఎర్రమట్టి వేయడం వల్ల శ్రీరామ నవమి సందర్భంగా తెల్లటి బట్టలు వేసుకొని వచ్చిన వారు రోడ్డు దాటే సరికి వారి దుస్తులు ఎరుపు వర్ణంలోకి మారాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా అడ్డదిడ్డంగా మట్టిని రోడ్డుపై వేసి ప్రజలకు ఇబ్బందులు కల్పించడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు సక్రమంగా చేయకుండా గాలిని కాలుష్యం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కనుల పండువగా కల్యాణం


కమలాపురంలో కోదండ రామాలయంలో కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న పురోహితులు


చింతకొమ్మదిన్నె మండలంలో శ్రీ రామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : కమలాపురంతోపాటు కె.అప్పాయపల్లె, గంగవరం, విభరాపురం, సంబటూరు, కంచన్నగారిపల్లె, కుంట, కోగటం, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, నల్లింగాయపల్లె, రాజుపాళెం, మీరాపురం తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక ఆర్‌ఎస్ రోడ్డులో వెలసిన శ్రీ సీతారామాంజనేయ దేవస్థానం, క్రిష్టా నగర్‌లోని సీతారామాలయం, ఎంపీడీఓ కాలనీ రామాలయం, కె. అప్పాయపల్లెలోని రామాలయం, అలాగే గంగవరం, విభరాపురం, పెద్దచెప్పలి, కుంట, కంచన్నగారిపల్లె, కోగటం, సి.రాజుపాళెం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, సంబటూరు, మీరాపురం, మండలంలోని వివిధ గ్రామాల్లో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వాముల వారిని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. క్రిష్టా నగర్‌లో నిర్వహించిన బండ లాగుడు పోటీలు రసవత్తరంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 10 జతల కాండ్లు పోటీల్లో పాల్గొన్నాయి.

వీరపునాయునిపల్లె : మండలంలోని తాటిమాకులపల్లె, సంగాలపల్లె, పాయసంపల్లె, యు వెంకటాపురం, ఉరుటూరు గ్రామాల్లో సీతారాముల కల్యాణం నేత్ర పర్వంగా సాగింది. తాటిమాకులపల్లె రామాలయంలో నిర్వహించిన కల్యాణమహోత్సవంలో రిటైర్డ్ జడ్జి పాలెం చెన్నకేశవరెడ్డి కుటుంబ సభ్యులు పాలెం మల్లికార్జున్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, భూజాత్‌రెడ్డి, సుబ్బారెడ్డి దంపతులు పాల్గొన్నారు.

వల్లూరు : మండలంలోని పలు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్దపుత్తలోని పురాతన యోగా రామాలయం, వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద వున్న రామాలయం, కొప్పోలులోని ఆలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్దపుత్తలో జరిగిన కల్యాణ మహోత్సవంలో రాష్ట్ర పరిశ్రమల సలహాదారు రాజోలు వీరారెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. వారు రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

చింతకొమ్మదిన్నె : మండలంలోని వెంకటగారిపల్లిలో సీతారాముల వారి ఆలయంలో కార్పొరేటర్ గుత్తిరెడ్డి చంద్రహాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొప్పర్తిలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయ ఆవరణంలో నిర్వహించిన సీనియర్ ఎద్దుల బండలాగుడు పోటీలను కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండవ బహుమతి రూ.40 వేలు, మూడవ బహుమతి రూ.30 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.6,016, ఏడు, ఎనిమిదవ బహుమతి రూ.5 వేలను అందించారు. మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


కమలాపురంలో సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

కో-ఆపరేటివ్ స్టోర్స్‌ను అభివృద్ధి చేస్తాం

ప్రొద్దుటూరు : రానున్న రోజుల్లో ప్రొద్దుటూరు సెంట్రల్ కన్స్యూమర్స్ కో-ఆపరేటివ్ స్టోర్స్ లిమిటెడ్‌ను అభివృద్ధి చేసి ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటామని అధ్యక్షురాలు గజ్జల కళావతి తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం తొలి మారు గురువారం పాలకవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సూచనతో స్టోర్స్‌ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. 2022–23 ఏడాది జరిగిన జమా ఖర్చుల వివరాలపై వివరంగా చర్చించారు.

పుల్లారెడ్డిపల్లెలో వాలీబాల్ పోటీలు

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లెలో గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని పుల్లారెడ్డిపల్లె యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు జయపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.10 వేలను గెలుపొందిన జట్లకు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు పోటీల్లో పాల్గొనేందుకు ఎంట్రీ ఫీజు రూ.వెయ్యి ఏప్రిల్ 3వ లోపు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 7036734661, 7093178932లో సంప్రదించాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రొద్దుటూరు : స్థానిక సరస్వతి విద్యామందిరం రోడ్డులో మేస్త్రి బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ ఉమా యాగంటి ఈశ్వర చలివేంద్రాన్ని గురువారం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ నరసింహులు ప్రారంభించారు. 47 ఏళ్లుగా బాబయ్య చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఏఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా పానకం వడపప్పు పంపిణీ చేశారు.

5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి

ప్రొద్దుటూరు : వివిధ వర్గాలకు చెందిన కార్మికుల, కర్షకుల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో కార్మిక, కర్షక మైత్రి నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ తెలిపారు.

తల్లీ, పిల్లలు సురక్షితం

కడప అర్బన్: కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 20న తల్లి జరీనా, తన ఇద్దరు పిల్లలు హాతీమ్, సానియలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటనపై ఈనెల 27న పోలీసుస్టేషన్‌లో ఆమె తల్లి ఖదీరున్నీసా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీఐ సయ్యద్ హాసం, తమ సిబ్బందితో కలిసి ఆధునిక శాస్త్ర సాంకేతికతను ఉపయోగించారు. ఎట్టకేలకు జరినా, తన పిల్లలతో అదే రోజున బెంగుళూరులో తన మేనత్త ఇంటికి వెళ్లిందని నిర్ధారించుకున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఆమెను, పిల్లలను కడపకు రప్పించారు. భర్త అక్బర్, ఆమె తల్లి ఖదీరున్నీసా సమక్షంలో జరినా, పిల్లలను అప్పగించారు. కాగా తన భర్త అక్బర్ వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో మనస్తాపం చెందిన తన పిల్లలతో పాటు వెళ్లిపోయాననీ జరీనా వివరించింది.

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కడప కల్చరల్ : కడప నగరపాలక సంస్థ పరిధి 48వ డివిజన్‌లోని హోమియోపతి కళాశాల ఎదుట వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. గురువారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏఎస్‌ఆర్ నగర్, నంద్యాల నాగిరెడ్డి, ఆచార్ల కాలనీల ప్రజలు స్వామి వారిని దర్శించుకుని, విశేష పూజలు చేశారు. భక్తులకు పానకం పంపిణీ చేశారు. రమణస్వామి, కృష్ణమాచారి, గురువయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

షిరిడిసాయికి నవమి పూజలు


షిరిడిసాయికి హారతి ఇస్తున్న అర్చకుడు

కడప కల్చరల్ : శ్రీరామ నవమి పర్వదిన సందర్భంగా కడప నగరం కో–ఆపరేటివ్ కాలనీలోని శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం నవమి పూజలను ఘనంగా నిర్వహించారు. ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు నిర్వహిస్తున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఉదయం ప్రత్యేక పూజలు, సంధ్య హారతి, రాత్రి విశేష పూజలు, ఊయల సేవ, జెండా ఊరేగింపు, చందనోత్సాహం, చందన ప్రసాదం నిర్వహించారు.

ఉస్మాన్ మసీదులో ఇఫ్తార్


ఉస్మాన్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్

కడప కల్చరల్ : కడప నగరం సబ్ జైలు వద్ద గల ఉస్మాన్ మసీదులో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ముక్తార్ అహ్మద్ మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులతో ప్రతిరోజు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపవాస దీక్షలో ఉన్న వారికి ఇఫ్తార్ ఏర్పాటు పుణ్యదాయకంగా భావిస్తున్నామన్నారు. సొసైటీ సభ్యులు, పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థికసాయం

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర వృద్ధాశ్రమానికి స్థానిక దాతలు ఆర్థికసాయం అందజేశారు. గురువారం స్థానిక విశ్వాత్మ పిరమిడ్ మెడిటేషన్ అండ్ యోగా సెంటర్ ఆధ్వర్యంలో యోగా, ధ్యాన గురువులు డాక్టర్ డి.ఊర్మిళాదేవి, జీవీ శేషారెడ్డి ఆశ్రమంలో సోలార్ దీపాలు ఏర్పాటుకుగాను రూ. 10 వేల విరాళం అందజేశారు. దాంతోపాటు మైత్రేయి బుద్ధ పిరమిడ్ ధ్యానులు సేకరించిన వస్త్రాలను ఆశ్రమ నిర్వాహకులు రాంబాబుకు అందజేశారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వల్లూరు : మండల పరిధిలోని అంబవరం గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 1– 30 గంటల నుంచి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలాపురం ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి అధికారులతో కలిసి పాల్గొని ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు వేలం

కమలాపురం : కమలాపురం నగర పంచాయతీకి చెందిన బస్టాండు, దినసరి కూరగాయల మార్కెట్టు, జంతువధ శాల, మార్కెట్ రూములకు సంబంధించి శుక్రవారం ఉదయం 11 గంటలకు వేలం పాట వేస్తున్నట్లు నగర కమిషనర్ రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దినసరి మార్కెట్, బస్టాండుకు రూ.50 వేల చొప్పున, జంతు వధశాల, మార్కెట్ రూములకు రూ.20 వేలు చొప్పున డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవలెనని ఆయన పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గోపవరం : బద్వేలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో పద్మావతి మెడికల్ స్టోర్స్ వద్ద గురువారం చలివేంద్రం ప్రారంభించారు. ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు.